RNI NO : TELTEL/2023/89146

TELUGU DAILY

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగు దినపత్రిక | సంపుటి :02 | సంచిక : 306 | బుధవారం 05 నవంబర్ 2025 | పేజీలు: 08 | వెల రూ.5

PUBLISHED FROM : KARIMNAGAR : CIRCULATED TO : ADILABAD, WARANGAL, NIZAMABAD, HYDERABAD,KHAMAM, NALGONDA, MAHBUBNAGAR,MEDAK, RANGAREDDY

## రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77805 51339    98491 98098

## 11లోగా కేసీఆర్, హరీష్ రావును
# అరెస్ట్ చేయాలి

- బీఆర్ఎస్ బీజేపీది 'ఫెవికాల్' బంధం కాదని నిరూపించాలి
- సొంత చెల్లిని గెంటేసిన దుర్మార్గుడు కేటీఆర్
- జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీతో నవీన్‌యాదవ్‌గెలుపు ఖాయం
- ఉప ఎన్నిక తర్వాత జూబ్లీహిల్స్‌లో పేదలకు 4 వేల ఇండ్లు
- బీఆర్ఎస్, బీజేపీపై తీవ్ర స్థాయిలో సీఎం ఫైర్
- రహమత్‌నగర్‌లో సీఎం రేవంత్‌రోడ్‌షో



**శెనార్తి మీడియా, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రహమత్‌నగర్ డివిజన్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు కేవలం సెంటిమెంట్ పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్‌బీజేపీలది 'ఫెవికాల్' బంధం అని నిరూపించడానికి, నవంబర్ 11వ తేదీలోగా ఆ ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసీఆర్, హరీష్‌రావుపై చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి, కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ రెండు పార్టీలు ఒక్కటేనని తేలిపోతుందని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల తర్వాత జూబ్లీహిల్స్‌లో పేదలకు 4 వేల ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదేనని సీఎం హామీ ఇచ్చారు.

**పీజేఆర్ కుటుంబంపై కేసీఆర్ దుర్మార్గం**

పీజేఆర్ కుటుంబంపై కేసీఆర్ వ్యవహరించిన తీరును సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఆనాడు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఖైరతాబాద్‌లో

మిగతా 2వ పేజీలో..

## ఫీజు రీయింబర్స్ మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

- సంస్కరణలపై అధ్యయానికి కమిటీ ఏర్పాటు
- కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు

2

## ఓయూ హాస్టల్‌లో కల్తీ ఆహారం

- గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థుల ఆందోళన

2

## సీఎం రేవంత్‌తో జర్మన్ కాన్సూల్ బృందం భేటీ



- డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణపై వివరణ
- సిఎంతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం భేటీ



## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన

- సుమోటోగా కేసు నమోదు చేసిన మానవహక్కుల సంఘం

**శెనార్తి మీడియా, హైదరాబాద్ :**

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తమ వారిని కోల్పోయి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. మీడియా ఛానల్స్, పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చర్యలు తీసుకుంది. ఈ సంఘటనపై డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రోడ్లు రవాణా, భవనాల శాఖ, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీలకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ కు కూడా నివేదిక సమర్పించాలని హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. మరోవైపు చేవెళ్ల బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని డీజీపీ శశిధర్

మిగతా 2వ పేజీలో..

## చేవెళ్ల రోడ్డు ప్రమాదస్థలిని సందర్శించిన డిజిపి

- టిప్పర్ వేగంతోనే బస్సుకు ప్రమాదం
- టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాద కారణం
- దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడి

2

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

4



- కారును ఢీకొన్న ట్రక్కు.. ఆరుగురు దుర్మరణం

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

4

- రోడ్డుకు అడ్డంగా పడ్డ ట్రాక్టర్..నలుగురికి గాయాలు



## ట్రంప్ సుంకాలపై న్యాయవిచారణ

4



- సుప్రీంలో సవాల్ చేసిన వ్యాపారులు
- నేడు విచారణ జరుగున్నట్లు వార్తలు

## బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ



- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

- మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్
- ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం



**శెనార్తి మీడియా, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడిరది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడిరచాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న

మిగతా 2వ పేజీలో..

## అజారుద్దీన్ కు మైనార్టీశాఖ

- పబ్లిక్‌ఎంటర్‌ప్రైజెస్ కూడా..
- మంత్రి అడ్లూరి నుంచి శాఖ కేటాయింపు



2

## వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

3

## జాబ్ క్యాలెండర్ హామీతో మోసం

- ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు
- నిరుద్యోగులను నిండా ముంచారు
- జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత

3

జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

- శెనార్తి మీడియా, ఆదిలాబాద్




4



## అమెరికా బాటలో కెనడా

- భారీగా విద్యార్థి వీసాలు తిరస్కరణ

## ఛత్తీస్‌ఘడ్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్ గూడ్స్ రైలు

3





# అజారుద్దీన్‌కు మైనార్టీ శాఖ

## పబ్లిక్‌ఎంటర్‌ప్రైజెస్ కూడా.. మంత్రి అడ్లూరి నుంచి శాఖ కేటాయింపు

**హైదరాబాద్, నవంబర్ 4:** రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు కేటాయించి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచార అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

# ఓయూలో ఉద్రిక్తత

## కల్తీ ఆహారం పెడుతున్నారని నిరసన

## గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థుల ఆందోళన




**హైదరాబాద్, నవంబర్ 4:** ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కల్తీ ఆహారం పెడుతున్నారని ఓయూ విద్యార్థులు నిరసన చేపట్టారు. దీంతో ఓయూలో పోలీసులు భారీగా మోహరించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థులు నిరసన దిగారు. ఆహారం బాగాలేదని, నాణ్యత పెంచాలని కాంట్రాక్టర్‌కు విద్యార్థులు సూచించారు. కల్తీ ఆహారం తిని అనారోగ్యానికి గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు, ఓయూ అధికారులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఓయూ ప్రధాన రహదారిపై భోజనంతో కూడి పాత్రలతో నిరసనకు దిగారు. ఆహారం బాగాలేదని చెప్తే.. ఏం చేసుకుంటారో చేసుకోండి అని కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని విద్యార్థులు పేర్కొన్నారు. నాణ్యత లేని కల్తీ ఆహారాన్ని పెడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

# చిన్నారిపై డ్యాన్స్ మాస్టార్ అసభ్య ప్రవర్తన

## పోలీసులకు ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు

**హైదరాబాద్, నవంబర్ 4:** నగరంలోని బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్ బోయిన్‌పల్లిలో సుబ్బు డాన్స్ స్టూడియో నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ నాలుగేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. గత రెండు నెలలుగా తన వద్ద డ్యాన్స్ నేర్చుకునేందుకు వస్తున్న బాలిక పట్ల స్టూడియోలో ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లుగా డ్యాన్స్ స్కూల్‌కు వెళ్లనని మారాం చేస్తుండటంతో.. చిన్నారిని తల్లిదండ్రులు ప్రశ్నించగా అసలు విషయం బయటకువచ్చింది. జ్ఞానేశ్వర్.. స్టూడియోలో చిన్నారిపై లైంగిక వేధింపులకు గురి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పడంతో వెంటనే బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. జ్ఞానేశ్వర్‌ను రిమాండ్‌కు తరలించడంతోపాటు స్టూడియోను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పాఠశాలలోనే చిన్నారులకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి డ్యాన్స్ స్టూడియోలకు పంపే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.




# 11లోగా కేసీఆర్, హరీష్ రావును అరెస్ట్ చేయాలి

మొదటి పేజీ తరువాయి..



భాగంగా ఉన్నప్పుడు, బస్తీ వాసుల తాగునీటి కష్టాలు తీర్చడానికి పీజేఆర్ ఖాళీ కుండలతో ధర్నా చేసి, నాటి సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి కృష్ణా జలాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. లక్షలాది పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చిన పేదోళ్ల దేవుడు పీజేఆర్ అని కొనియాడారు. 2007లో పీజేఆర్ ఆకస్మికంగా మరణిస్తే, అభ్యర్థిని పెట్టకుండా టీడీపీ, బీజేపీలు ఆయన కుటుంబాన్ని ఏకగ్రీవంగా నిలబెట్టేందుకు అండగా నిలబడ్డాయని, కానీ కేసీఆర్ మాత్రం అభ్యర్థిని నిలబెట్టి ఆ మంచి సంప్రదాయాన్ని తుంగలో తొక్కాడని ఆక్షేపించారు. పీజేఆర్ సతీణి కేసీఆర్‌ను కలిసేందుకు వెళితే మూడు గంటలు బయట నిలబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని మండిపడ్డారు.

**సొంత చెల్లిని గెంటేసిన దుర్మార్గుడు కేటీఆర్**

కేటీఆర్ మహిళా సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకురావడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఫైర్ అయ్యారు. "సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఇంటి నుంచి బయటకు పంపిన దుర్మార్గుడు కేటీఆర్," అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇలాంటి వాడు మాగంటి సునీతమ్మను ఆదుకుంటాడంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వాళ్లను చీపురు దెబ్బలు కొట్టాలని అన్నారు. మహిళలకు, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని స్పష్టం చేశారు. షేక్‌పేటలో చెత్త సమస్య ప్రస్తావిస్తూ, "గత పదేళ్లుగా మంత్రిగా ఆ చెత్త నా కొడుకేగా కారణం. వాడిని చెట్టుకు కట్టేయండి," అంటూ కేటీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. "పదేళ్లుగా పాలించిన వాళ్లు పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కానీ, మా ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 14,197 రేషన్ కార్డులు పేదోళ్లకు ఇచ్చింది," అని తెలిపారు. నియోజకవర్గంలో 25,925 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ప్రతినెలా 23,311 క్వింటాళ్ల సన్నబియ్యం అందిస్తున్నామని వివరించారు. ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. పదేళ్లు బెంజ్ కారులో తిరిగిన వాళ్లు ఇప్పుడు ఆటోలో తిరుగుతూ నటిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**బీజేపీ, బీఆర్ఎస్‌ల చీకటి ఒప్పందం**

బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం ఉందని రేవంత్ రెడ్డి పదేపదే ఆరోపించారు. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని బీజేపీ నేతలు పదేపదే చెప్పినా, కేసును సీబీఐకి అప్పగిస్తే మూడు నెలలైనా ఎఫ్ఐఆర్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌ను అరెస్ట్ చేయడానికి గవర్నర్ ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని నిలదీశారు. కారు ఢిల్లీకి చేరగానే కమలంగా మారుతోందని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధం కాకపోతే, నవంబర్ 11లోగా కాళేశ్వరం కేసులో కేసీఆర్, హరీష్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని, అందుకే జూబ్లీహిల్స్‌లో బీజేపీ పరోక్షంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి కోసం నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

- సంస్కరణలపై అధ్యయానికి కమిటీ ఏర్పాటు
- కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు

**హైదరాబాద్,నవంబర్ 4 :**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో చాలా అవతకవకలతో పాటు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంటున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు ఆందోళనకు దిగాయి. కాలేజీల బంద్ కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది. ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరుగుతోంది. సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో.. కాలేజీ యాజమాన్యం తమ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తుంది. ఆ క్రమంలో కాలేజీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దీంతో వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం తెలుపుతోంది. అందుకు ఆ కాలేజీల యాజమాన్యం సానుకూలంగా స్పందించకుండా ఆందోళనలకు దిగింది.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

మొదటి పేజీ తరువాయి..

తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. 4 ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయ స్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయా లని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయ స్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన

మొదటి పేజీ తరువాయి..

రెడ్డి, సీపీ అవినాష్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. సోమవారం తెల్లవారుజామున తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కంకర మొత్తం బస్సులో కుప్పగా పడిపోయింది. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయపడటంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్ అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

# సిఎంతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం భేటీ

**హైదరాబాద్,నవంబర్ 4 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వక భేటీ అయింది. తెలంగాణలో ఎడబ్ల్యూఎస్ కు సంబంధించి ఆన్ గోయింగ్ డేటా సెంటర్స్ ప్రాజెక్టులు, విస్తరణ తదితర అంశాలపై సీఎం తో ప్రతినిధి బృందం చర్చించింది. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం స్పష్టం చేసారు. సమావేశంలో డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌తో జర్మన్ కాన్సూల్ బృందం భేటీ

## డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణపై వివరణ

**హైదరాబాద్,నవంబర్ 4 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం భేటీ అయ్యింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్ లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ని హైదరాబాద్ లో ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి జర్మనీ బృందం వివరించింది. ఈ కేంద్రాన్ని ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజాప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని సిఎం తెలిపారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సీఎం కు జర్మనీ బృందం వివరించింది. హైదరాబాద్ లో ఇన్నోవేషన్ హబ్ గా తయారు చేసేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని సిఎం ఈ సందర్భంగా కోరారు. హైదరాబాద్ లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సుల్ జనరల్ ను ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందన్నారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. వీటితో పాటు వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని కోరారు.

# చేవెళ్ల రోడ్డు ప్రమాదస్థలిని సందర్శించిన డీజీపీ

- టిప్పర్ వేగంతోనే బస్సుకు ప్రమాదం
- టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాద కారణం

హైదరాబాద్, నవంబర్ 4 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జా గూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్‌ను మెకానిక్ ద్వారా పరిశీలిస్తున్నా మన్నారు. దాదాపు 40 మీటర్లు టిప్పర్ లాక్కెళ్లడంతో ఈ ప్రమాద తీవ్రత పెరిగిందని వివరించారు. ఈ ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో రైట్ సైడ్ కూర్చున్న వారు చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే రోడ్డు మలుపు ఉంది కానీ.. అది యాక్సిడెంట్ అయ్యేంత తీవ్రంగా లేదన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని.. ఇది అందరి బాధ్యతగా చూడాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల కారణంగానే మరణిస్తున్నారని గుర్తు చేశారు. రోడ్డు మీద డ్రైవ్ చేసే వారు డిఫెన్స్ కండిషన్‌ను అంచనా వేసుకొని డ్రైవ్ చేయాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చే నెల నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రమాదాన్ని చేవెళ్ల ఏసీపీ విచారణ అధికారగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన అన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.

# మన జీవనవిధానంలో వ్యవసాయం భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, నవంబర్ 4:** దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమే ఓనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని 54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించుకోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63శాతం పెరిగిందని చెప్పు కొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచ ఓచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నా ఓమని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ది పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# జాబ్ క్యాలెండర్ హామీలతో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు**

**నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**



ఆదిలాబాద్,నవంబర్ 4: జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.


# ఘోర రైలు ప్రమాదం

**ఎదురెదురుగా ఢీకొన్న రెండు రైళ్లు**

**ఆరుగురు మృతి, 25మందికి పైగా గాయాలు**

**రాయపూర్, నవంబర్ 4 :** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా రెండు రైళ్లు ఢీకొన్నాయి. మంగళవారం బిలాస్పూర్ లోని జైరామ్ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. గూడ్స్ రైలును కోర్బా ప్యాసింజర్ ట్రైన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో లాల్‌ఖదాన్ ప్రాంతంలో మెము ప్యాసింజర్-గూడ్స్ రైళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంతో బిలాస్‌పుర్-హావ్‌డా లైన్ మార్గంలో రైళ్లరాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది. దాంతో పలు సర్వీసులను రద్దు చేశారు. మరికొన్నింటిని దారిమళ్లించారు. ఈ ఘటన వల్ల ఆ మార్గంలో ఎలక్ట్రిక్ వైర్లు, సిగ్నల్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయచర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకున్నారు. దెబ్బతిన్న కోచ్‌లను పట్టాల నుంచి తొలగిస్తున్నారు.






# ఒక్క చాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రం దివాళా తీసింది

**కార్లు, బుల్డోజర్ మధ్యే జూబ్లీహిల్స్ యుద్ధం**

**కాంగ్రెస్ గెలిస్తే ఎవరికి రక్షణ**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, నవంబర్ 4:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే ఇళ్లు కూడా బుల్డోజర్‌కు గురవుతాయని, ప్రజలను ఎవరు రక్షించరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజీగూడలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన కాంగ్రెస్ సర్కారు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని క్షతపరుస్తూ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రేవంత్ పూర్తిగా నిలబెట్టలేదని, విద్యార్థులకు హామీ ఇచ్చిన విద్యా భరోసా కార్డు కూడా అందించలేదని గుర్తుచేశారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణాల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనోడు అభివృద్ధి చేయగలడా అని ప్రశ్నించారు. ఉద్యోగుల విషయానికి వస్తే, కొత్త పీఆర్సీ, డీఏ హామీలు మాత్రమే ఇచ్చి అమెళ్లు పెట్టలేదని, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రెండేళ్లుగా అందించని పరిస్థితిని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు గురయ్యారని, విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, గిరిబోళ్ల ఇళ్లు కూల్చి ఎవరు నిలబడరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికను "కారు-బుల్డోజర్ మధ్య యుద్ధం" అని వివరిస్తూ, కాంగ్రెస్ గెలిస్తే ప్రతి ఇంటికీ నీటి బిల్లులు వస్తాయని, అందులో ప్రజల అభివృద్ధి నిలబడదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల అభివృద్ధి, కాంగ్రెస్ రెండేళ్ల అరాచకాన్ని గుర్తుచేసుకుని, ఓటర్లు సునీతా గోపినాథ్‌కి భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు.




# ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోమారు వర్షం

**అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం**

**హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం**



**హైదరాబాద్/వరంగల్, నవంబర్ 4:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ - మల్కాజిగిరి, యాదాద్రి - భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లిడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

# డ్రగ్స్ పార్టీ భగ్నం

## గచ్చిబౌలి కో లివింగ్ హాస్టల్‌లో దాడి

**నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు**

**భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**హైదరాబాద్,నవంబర్ 4:** నగరంలోని గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో ఎస్ఎం లగ్జరి గెస్ట్ రూమ్, కో లివింగ్ గెస్ట్ రూమ్‌లో జరుగుతున్న డ్రగ్స్ పార్టీని ఎస్‌వోటీ పోలీసులు భగ్నం చేశారు. భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మాదాపూర్ అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..బెంగళూరులో ఉంటున్న ఇద్దరు నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు చేశారని వెల్లడించారు. ప్రస్తుతం ఇద్దరు నైజీరియన్లు పరారీలో ఉన్నారని... వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకు వచ్చి తేజ లోకల్‌గా ఉన్న యువత, స్టూడెంట్‌లకు అమ్ముతారన్నారు. ఇప్పటివరకు అన్ని లావాదేవీలు కలెక్ట్ చేశామని.. నిందితులు రిమాండ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడ్డ తేజ కృష్ణ ఆర్కిటెక్ట్ అని.. కడపకు చెందిన వ్యక్తిగా తెలిపారు. మొత్తం ఈ కేసులో 19 మంది ఉన్నారు..వారి 9 మంది ఫెడ్లర్లు ఉన్నారన్నారు. పరారీలో ఉన్నవారిలో నలుగురు ఫెడ్లర్లు ఉన్నారని చెప్పారు. తేజ కృష్ణపై గతంలో మూడు ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయని డీసీపీ ఉదయ్ రెడ్డి వెల్లడించారు. మాదాపూర్ ఎస్ఓటీ గచ్చిబౌలి పోలీసులు ఎస్ఎం కో లివింగ్ హాస్టల్లో రైడ్ నిర్వహించారని తెలిపారు. కో లివింగ్ హాస్టల్‌లో తేజ కృష్ణ, లోకేష్ రెడ్డి వద్ద డ్రగ్స్ లభించాయని చెప్పారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మరో నలుగురు.. హోటల్ నైట్ ఐలో దొరికారన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నామని.. వారి వద్ద కూడా డ్రగ్స్ లభించినట్లు తెలిపారు. మొత్తం ఈ కేసులో 13 మందిని అరెస్ట్ చేశామని.. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో ఆరుగురు ఫెడ్లర్లు, ఐదు మంది కన్జ్యూమర్లు ఉన్నారన్నారు.



# బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ

- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

**పాట్నా,నవంబర్4 :**

బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వీయాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండిరచిన వరి గోధుమలకు ఎంఎస్‌పి ధర కంటే అదనపంగా క్వింటాలకు రూ. 300, 400 చొప్పున చెల్లించనున్నట్లు హామీనిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పున జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యక్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్‌డిఏ కూటమిని దెబ్బతీసేందుకు అలవి కాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వియాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై–బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్లు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధర (ఓªాఖ)తో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.. రైతులకు నీటి పారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తాము. మై బహిన్ మాన్ యోజన పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో జనవరి 14వ తేదీకల్లా రూ. 30,000లు జమ చేస్తాం. ఇది సంవత్సరం మొత్తానికి వర్తిస్తుంది. నూతన సంవత్సరం, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా ముందుగానే నగదును జమ చేస్తాం. నిత్యవసర ధరలు పెరిగిన ఈ సమయంలో.. ఈ డబ్బుతో వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. రాష్ట్రంలోని మా తల్లులు, సోదరీమణుల డిమాండ్ల మేరకే మా ప్రభుత్వం ఏర్పడుతుంది' అని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మహాగట్బంధన్ కట్టుబడి ఉందని తేజస్వి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి ఇంటి నుండి 70 కిలోమీటర్ల లోపే వారి బదిలీలు చేస్తాము. బదిలీల పోస్టింగ్‌లో కచ్చితంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. దీన్నే మ్యానిఫెస్టోలో కూడా ప్రస్తావించాము అని తేజస్వి అన్నారు.

# డ్రగ్స్ వాడకం... వ్యాపారంలో డాక్టర్

- ముషీరాబాద్ డాక్టర్ నిర్వాకం
- దాడిచేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్,నవంబర్ 4 : ముషీరాబాద్‌లో ఓ వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. దాదాపు మూడు లక్షల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులతో కలిసి జాన్ పాల్ అనే డాక్టర్ ఢల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి అమ్మకాలు సాగిస్తున్నారు. ముషీరాబాద్‌లో ఓ ఇంట్లో ఉంటూ డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నాడు. పక్కా సమాచారంతో డాక్టర్ ఇంట్లో సోదాలు జరిపిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ బృందానికి భారీగా డ్రగ్స్ లభించింది. వైద్యుడి ఇంట్లో డ్రగ్స్‌ను చూసి ఎక్సైజ్ పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ముగ్గురు స్నేహితులు కలసి డ్రగ్స్ దందా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్ అనే యువకులు.. బెంగుళూరు, ఢల్లీనుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి.. డాక్టర్ జాన్‌పాల్ నివాసంలో పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇందుకు డాక్టర్ సహకరించాడు. డాక్టర్ స్వయంగా డ్రగ్స్ వాడటంతో పాటు వాటిని అమ్మకాలు జరుపుతున్నట్లు ఎస్టీఎఫ్ టీం గుర్తించింది. డ్రగ్స్ దందాపై సమాచారం అందిన వెంటనే ఎస్టీఎఫ్ బృందం డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో సోదాలు నిర్వహించారని.... ఈ సోదాల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడినట్లు ప్రదీప్ తెలిపారు. డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో ఓజి కుష్, ఎండిఎంఎ, ఎల్ఎస్‌డి బాస్ట్స్, కొకైన్, గుమ్మస్, హాసిస్ ఆయిల్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ రూ. మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. అయితే డ్రగ్స్ తెప్పిస్తున్న ప్రమోద్, సందీప్, శరతులు ప్రస్తుతం పరారీలో ఉండగా.. వీరిపై కూడా కేసు నమోదు అయ్యింది.

# మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్,నవంబర్4 :**

గత కొన్ని రోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. సోమవారం స్వల్పంగా పెరిగి రూ.1.23 లక్షల మార్కు దాటిన బంగారం ధర మంగళవారం మళ్లీ దిగొచ్చింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధరలో రూ.650 మేర కోత పడి రూ..1,12,250కు దిగింది. వెండి ధర ఏకంగా రూ.3 వేల మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.1,51,000గా ఉంది .హైదరాబాద్, విజయవాడల్లో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460గా ఉంది. 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. రెండు నగరాల్లో వెండి రేట్ కిలోకు రూ.1,65,000 వద్ద కొనసాగుతోంది. మదపర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం, ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నానాటికీ సన్నగిల్లుతున్న ఆశలు, మళ్లీ పుంజుకున్న డాలర్ వెరసి బంగారం ధరలను తగ్గిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ట్రంప్ సుంకాలపై న్యాయవిచారణ

- సుప్రీంలో వ్యాపారుల సవాల్
- నేడు విచారణ జరుగున్నట్లు వార్తలు





**వాషింగ్టన్, నవంబర్ 4:** అమెరికా చరిత్రలోనే అత్యంత కీలకమైన న్యాయవిచారణకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు సిద్ధమవుతోంది. టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధం సాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాలను నిర్ణయించే అంశంపై న్యాయస్థానం అమెరికా కాలమానం ప్రకారం బుధవారం విచారణ జరపనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ట్రంప్ మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ఈ సుంకాలు విధించారని అమెరికా సర్కారు తెలిపింది. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరగనుంది. ఈ కేసులో ట్రంప్‌నకు వ్యతిరేకంగా భారత సంతతి అటార్నీ నీల్ కత్యాల్ వాదనలు వినిపించనున్నారు. దీంతో ఆయన పేరు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియాలో మార్మోగుతోంది. 54 ఏళ్ల నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులను వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలున్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ కేసు విచారణకు ట్రంప్ ప్రత్యక్షంగా హాజరుకావాలని తొలుత భావించారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రభుత్వం తరఫున ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ హాజరుకానున్నారు. ఈ కేసు విచారణపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇందులో మేం గెలిస్తే.. ప్రపంచంలోనే అత్యంత సంపన్న, సురక్షితమైన దేశంగా అమెరికా నిలుస్తుంది. ఒకవేళ ఓడిపోతే పేద దేశంగా మారుతుంది. అలా జరగొద్దని భగవంతున్ని కోరుకుంటున్నా అని రాసుకొచ్చారు.

# బెంగాల్లో సర్‌కు వ్యతిరేకంగా మమత గళం

**కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహణ**

**ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం**



**కోల్‌కతా,నవంబర్ 4:** బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం విరుచుకుపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ బెంగాలీ మాట్లాడే పౌరులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన 'నిశ్శబ్ద రిగ్గింగ్' అని ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా మంగళవారనాడు కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీని మమత ముందుండి నడిపించారు. ఆమె మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు అభిషేక్ బెనర్జీ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ టైమ్‌లైన్ పెట్టుకుని మరీ ఇంత హడావిడిగా ఎస్‌ఐఆర్ నిర్వహించడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. బెంగాల్‌లో 2022లో ఓటర్ రివిజన్ జరిగిందని, అందుకు రెండేళ్లు పట్టిందని అన్నారు. ఇప్పుడు ఎస్‌ఐఆర్ పక్రియ నెలరోజుల్లోనే పూర్తిచేయాలనుకుంటున్నారని అన్నారు. ఈసీ పారదర్శకత్వను ప్రశ్నిస్తూ... బిహార్ ఎస్‌ఐఆర్‌లో ఎంతమంది రోహింగ్యాలు, బంగ్లాదేశీయులను గుర్తించారో చెప్పాలన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల జాబితా నుంచి అర్హులైన ఒక్క ఓటరును తొలగించినా బీజేపీ ప్రభుత్వ పతనాన్ని తమ పార్టీ చూస్తుందని మమత హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్‌తో కేంద్రం కుమ్మక్కై ఎస్‌ఐఆర్ పక్రియను ఒక ఉపకరణంగా వాడుకుంటోందని విమర్శించారు. హిందీ, పంజాబీ మాట్లాడే వాళ్లు ఎలా పాకిస్థానీయులు కాదో బంగ్లా మాట్లాడే వాళ్లు బంగ్లాదేశీయులు కాదని మమత అన్నారు. ఎస్‌ఐఆర్ పేరుతో ఓటర్లను బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఈ భయాలతోనే ఇప్పటికే ఏడుగురు ప్రాణాలు తీసుకున్నారని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. లీగల్ ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగిస్తే ఢిల్లీలో మెగా నిరసనకు మద్దతుదారులంతా సిద్ధంతా ఉండాలని కోరారు. కాగా, టీఎంసీ నిరసనలపై బీజేపీ మండిపడింది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ ఇదని ఆక్షేపణ తెలిపింది. అక్రమ వలసదారులను తమ ఓటు బ్యాంకుగా చేసుకున్న మమతా బెనర్జీ ఇప్పుడు వారికి రక్షణ కల్పిస్తున్నారని బీజేపీ ప్రతినిధి అమిత్ మాలవీయ ఆరోపించారు.

# బీహార్ ఎన్నికల్లో వివాదాస్పద వ్యాఖ్యలు

**కేంద్రమంత్రి లలన్ సింగ్‌పై కేసు నమోదు**



**పాట్నా,నవంబర్ 4:** బిహార్ ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి, జేడీయూ నేత లలన్ సింగ్ పై పాట్నా జిల్లా యంత్రాంగం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. వీడియా నిఘా టీమ్ నుంచి ఫుటేజ్‌ను సమీక్షించిన అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, ప్రజాప్రాతినిధ చట్టం కింద లలన్ సింగ్‌పై అధికారులు కేసు నమోదు చేశారు. మొకామా ప్రాంతంలో జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ తరఫున లలన్ సింగ్ ఇటీవల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా పోలింగ్ రోజున విపక్ష నేతలను ఇళ్ల నుంచి బయటకు రానీయరాదని, ఇళ్లకు తాళాలు వేయాలని సూచించారు. నాయకులను ఓటు వేయకుండా అడ్డుకోవాలని, వాళ్లు ఒకవేళ రచ్చచేస్తే ఓటు వేయడానికి తీసుకు వెళ్లి తిరిగి ఇంటికే పరిమితం చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, కేంద్ర మంత్రి మాట్లాడిన వీడియోను ఆర్జేడీ ప్రతినిధి ప్రియాంక భారతి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఎన్నికల కమిషన్‌ను బలహీనపరిచేలా లలన్ సింగ్ చర్యలు ఉన్నాయని, బహిరంగంగా ఓటర్లను కేంద్ర మంత్రి బెదిరిస్తుంటే ఈసీ ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. మొకామాలో ఇటీవల దులార్ చంద్ యాదవ్ అనే జన్‌సురాజ్ కార్యకర్త హత్యకు గురికావడంతో అనంత్ సింగ్‌ను పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన బేవుర్ జైలులో ఉన్నారు.



# అమెరికా బాటలో కెనడా

**భారీగా విద్యార్థి వీసాలు తిరస్కరణ**



**టోరంటో, నవంబర్ 4:** అమెరికా దారిలోనే కెనడా నిర్ణయాలు కూడా ఉంటున్నాయి. కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. దీంతో భారతీయ విద్యార్థుల విషయంలో తీవ్రంగా వ్యవహరిస్తున్నట్లు అర్థం అవుతోంది. కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కవ్వంపల్లి



**శెనార్తి మీడియా, బెజ్జంకి :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా షేక్‌పేట్ (ఓయూ కాలనీ)లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, కెకెసీ వైస్ చైర్మన్ నవాబ్ షేక్, ఇబ్రహీం పాల్గొన్నారు. బెజ్జంకి మండల కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చెప్యాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, బోనగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన తోటపల్లి గ్రామస్తులు



**శెనార్తి మీడియా, బెజ్జంకి :** హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును తోటపల్లి గ్రామస్తులు వారి నివాసంలో కలిశారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మృతిచెందిన సందర్భంగా గ్రామస్తులు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా తోటపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోయినపల్లి నర్సింగరావు, గాగిల్లపూర్ మాజీ సర్పంచ్ అన్నాడి సత్యనారాయణరెడ్డి, ఎంబరి సతీష్, పోలవేణి రాములు, రాజేందర్, నాంపల్లి శ్రీనివాస్, రేవోజు శ్రీనివాస్, ఉల్లి నరేష్, రేవోజు నాగరాజు, పోలవేణి శ్రవణ్, మడ్డి సందీప్, కొత్తగాట్టు ప్రవీణ్, కొన్నె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత నాయకుడు ఉట్ల కనకయ్యకు తుది వీడ్కోలు



**శెనార్తి మీడియా, గన్నేరువరం :** గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన దళిత నాయకుడు ఉట్ల కనకయ్య మంగళవారం మృతిచెందారు. ఆయన అంతిమయాత్రలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్ వర్మ పాల్గొన్నారు. కనకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సొల్లు అజయ్ వర్మ సానుభూతి తెలిపారు. నిరుపేద కుటుంబం అయిన వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇద్దరు కుమారులు, భార్య ఉన్న ఈ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం వంటి సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బోయిని హరీష్, కొంకటి గణేష్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై నిఘా

### ఎస్ఐ బోయిని సౌజన్య హెచ్చరిక



**శెనార్తి మీడియా, బెజ్జంకి :** మండలంలోని తోటపల్లి, గాగిల్లాపూర్ గ్రామ శివారులోని మోయ తుమ్మెద వాగు నుండి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు బెజ్జంకి ఎస్ఐ బోయిని సౌజన్య తెలిపారు. తోటపల్లి గ్రామ పరిసరాల్లో పోలీసులు నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడిరచారు. అనుమతి లేకుండా ఇసుకను తరలించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్
- సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు ద్వారా లేఖ పంపిన విద్యార్థి నాయకులు

**శెనార్తి మీడియా, కరీంనగర్**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు ద్వారా లేఖ పంపినట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్ మాట్లాడుతూ, ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల కళాశాలలు మూతపడుతున్నాయని, విద్యార్థుల చదువులు సంక్షోభంలోకి నెట్టబడ్డాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి విస్మరించారని ఆయన విమర్శించారు. రెండు రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రైవేట్ కళాశాలలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితి ఏర్పడిందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నగర అధ్యక్షుడు కేషబోయిన రాము యాదవ్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, శివ, రాజు, మల్లికార్జున్, మణి, వరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

- డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో బహిరంగ సభ
- కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి పిలుపు

**శెనార్తి మీడియా, పెద్దపల్లి**



భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, పార్టీ భావజాలాన్ని బలపరచాలని సీపీఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక భాస్కరరావు భవనంలో సీపీఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ కే. కనకరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకరన్న హాజరై కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, "పేద ప్రజల కోసం, స్వాతంత్ర సాధన కోసం నిరంతరం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ ఈ ఏడాది డిసెంబర్ 26న శతవసంతాలు పూర్తి చేసుకోనుంది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నాము" అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే సీపీఐ శతాబ్ది ఉత్సవాల జీపు జాతా ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి ప్రారంభమై రాష్ట్రం అంతా పర్యటించనున్నదని పేర్కొన్నారు. ఈ జాతా నవంబర్ 16న గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలకు రానుందని తెలిపారు. ఆ సందర్భంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి అప్పగిస్తూ, ప్రజా సంపదను అదానీ%-%అంబానీల జేబుల్లోకి నెడుతున్న మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చింది. ప్రజా రంగ రక్షణకు, రైతు%-%కూలీ%-%కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ మళ్లీ పోరాటాలు ఉధృతం చేయాలి" అని చాడ వెంకటరెడ్డి అన్నారు. అదే విధంగా, ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికలు దేశ రాజకీయ దిశను మారుస్తున్నాయని, ప్రజల మద్దతు మళ్లీ ఎడమపక్షాలకు చేరడం దేశ భవిష్యత్తుకు శుభసూచకమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోష్క మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, తాళ్లపల్లి మల్లయ్య, మడ్డి ఎల్లయ్య, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వైవీ రావు, మాటేటి శంకర్, రామచందర్, జిగురు రవీందర్, ఆరేపల్లి మానస్ కుమార్, బాలసాని లెనిన్, రేణికుంట్ల ప్రీతం, కల్లెపల్లి నవీన్, చంద్రశేఖర్, రంగు శ్రీనివాస్, తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు ఎంపిక




**శెనార్తి మీడియా, పెద్దపల్లి**

సుల్తానాబాద్ ప్రాంతంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలలో పదవ తరగతి విద్యార్థి సాయి గణేష్, తొమ్మిదో తరగతి విద్యార్థి ఎస్. సాత్విక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి కమిటీని ఆకట్టుకున్నారు. మహారాష్ట్రలోని షిరిడిలో నవంబర్ 7 నుండి 9 వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శివ, సతీష్, మమత కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని సాయి గణేష్, సాత్విక్‌లను ఘనంగా అభినందించారు.

## సింగరేణి కళాకారుడు రాధాకృష్ణకు ఘన సన్మానం

**శెనార్తి మీడియా, రామగుండం**



సింగరేణి ఆర్జీ-3 ఏరియాలోని ఓసిపి-1 కన్వేయర్ ఆపరేటర్, ప్రముఖ కళాకారుడు కొండ్ర రాధాకృష్ణను సహచరులు ఘనంగా సన్మానించారు. 2026 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా మందమర్రి సిఈఆర్ క్లబ్‌లో జరుగుతున్న సాంస్కృతిక పోటీల సమయంలో ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. 1992లో సింగరేణిలో చేరిన రాధాకృష్ణ క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచి కోల్ ఇండియా స్థాయి పోటీలలో పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కళాకారులు, ఐఎన్టీయూసీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా రాధాకృష్ణ ఆలపించిన లలితగీతం, గజల్ ప్రేక్షకులను అలరించాయి.

## బీసీ నేతకు కవిత పరామర్శ..

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :**



బీసీ సంక్షేమ సంఘం తలమడుగు మండల అధ్యక్షుడు మేకల రవికాంత్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను సోమవారం జిల్లా కేంద్రం లోని ఆయన నివాసంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## రైతు కూలీలతో మనాలి ఠాకూర్

**శెనార్తి మీడియా, రామగుండం :** రామగుండం శాసనసభ్యుడు రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ అంతర్గాం మండలం మధిర్యాల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని రైతులు, రైతు కూలీలు, మహిళలు, యువతతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను ఓర్పుతో విన్న మనాలి ఠాకూర్ ప్రతి సమస్యను సీరియస్‌గా తీసుకొని, వాటిని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లి త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ''రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది. రైతు కూలీ సుఖంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందు తుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజ్ ఠాకూర్ ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి ఇబ్బంది మా దృష్టిలో ఉంది, వాటిని త్వరగా పరిష్కరించే దిశగా మేము కట్టుబడి ఉన్నాం'' అని తెలిపారు. మహిళలతో కూడా మాట్లాడిన మనాలి ఠాకూర్ మహిళల ఆత్మనిర్భరత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. యువత ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు, గ్రామాభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను నేరుగా వినిపించి స్పందించినందుకు మనాలి ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడిన ఆమె, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## కారు బీభత్సం: ఇంటి ముందు మెట్లు ధ్వంసం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని కేశవపట్నం ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. హుజురాబాద్ ఇందిరానగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహేందర్ నిర్మల్ వెళ్లి తిరిగి వస్తుండగా కేశవపట్నం వద్ద కారు నియంత్రణ కోల్పోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అనంతరం కారు రోడ్డు పక్కనే ఉన్న భూపతి ప్రసాద్ ఇంటి ముందుకు దూసుకెళ్లింది. దీంతో ఇంటి ఇనుప మెట్లు కూలిపోయాయి. ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం కూడా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ మహేందర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ప్రమాదంతో ఆ కుటుంబానికి ఆస్తి నష్టం కలిగిందని భూపతి ప్రసాద్ తెలిపారు.

## కొనసాగుతున్న పంట నష్టం నమోదు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, రైతు భరోసా యాప్‌లో రైతువారీగా నష్టం వివరాలను ఏఈఓలు నమోదు చేస్తున్నారు. ప్రతి రైతు పొలాన్ని పరిశీలించి, పంట రకం, నష్ట శాతం, ఎకరాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్షపాతం కారణంగా జరిగిన నష్టాలను ఖచ్చితంగా నమోదు చేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో మంత్రిత్వ శాఖ సూచనల ప్రకారం అధికారులు ప్రతిరోజూ నివేదికలు అప్లోడ్ చేస్తున్నారు. రైతుల పంట నష్టం వివరాలు పూర్తయిన వెంటనే ఉన్నతాధికారులకు పంపించనున్నారు.



# విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయి

- కళాశాలల మనుగడ కోసం వెంటనే బకాయిలు చెల్లించాలి
- వాగ్దేవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్మాచి రాజశేఖర్

**శెనార్తి మీడియా, బోథ్**

గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో డిగ్రీ కళాశాలలు అంధకారంలోకి నెట్టబడ్డాయని వాగ్దేవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్మాచి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో వేరే మార్గం లేక ఈ నెల 3 నుంచి నిరవధిక బంద్ ప్రారంభించామని తెలిపారు. ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం బోథ్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద అధ్యాపకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే గొప్ప ఆశయంతో ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే, గత మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో ఈ పథకం అసలు లక్ష్యం దెబ్బతిందని తెలిపారు. నిధులు లభించక కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఫీజులు కట్టలేని విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషం లేదని, కానీ చెల్లించాల్సిన బకాయిలను వాయిదా వేయడం వల్ల కళాశాలల మనుగడ, అధ్యాపకుల ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, కళాశాలల రక్షణ కోసం ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని ఎల్మాచి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు ప్రవీణ్ రెడ్డి, అధ్యాపకులు ముత్యం సతీష్, కార్తీక్, ఆడెపు ప్రసాద్, రాజేశ్వర్, సురేష్, పందరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలి



- సింగరేణి కార్మికుల సమస్యలపై మిరియాల రాజిరెడ్డి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని టీబీజికేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తెలిపారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని పేర్కొంటూ, నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీ పతనానికి తొలి అడుగు వేయాలని కోరారు. సింగరేణి సమస్యలపై మాట్లాడుతూ, కెసీఆర్ సింగరేణి కుటుంబాల్లో వెలుగు నింపిన నాయకుడని, కారుణ్య నియామకాల ద్వారా 19 వేల మందికి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. గతంలో వారసత్వ నియామకాలను రద్దు చేసిన జాతీయ సంఘాలు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మెడికల్ బోర్డు నిర్వహించక కార్మికులను అయోమయంలోకి నెట్టేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని, కొత్త 150 మస్టర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కొత్త బొగ్గు గనులను ప్రారంభించి సింగరేణి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ సమావేశంలో మందమర్రి ఏరియా వైస్‌ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్ బడికెల సంపత్‌కుమార్, సారంగపాణి, ప్రతాప్, కాసిపేట్-2 నాయకులు పాల్గొన్నారు.



# ప్రత్యేక లోక్ అదాలత్ సమన్వయ సమావేశం

- న్యాయవాదులు సహకరించాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.వీరయ్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదులతో ప్రత్యేక లోక్ అదాలత్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.వీరయ్య అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సూచనల మేరకు నవంబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఐ యాక్ట్ కేసులు, సివిల్ ధావాలు, కుటుంబ వివాదాలు వంటి వాటిని రాజీ మార్గంలో పరిష్కరించేందుకు న్యాయవాదులు చురుకుగా సహకరించాలని కోరారు. జిల్లాలో ప్రస్తుతం రెండు వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ.నిర్మల, న్యాయవాద సంఘ అధ్యక్షుడు బి.జగన్, సీనియర్ న్యాయవాదులు కర్రె లచ్చన్న, చుంచు సదానందం, ఎం.రవీందర్‌రావు, డి.మనోహర్‌రావు, బాల భాస్కర్, ఆకుల రవీందర్, ఎండి.సంధాని, టీపీలు సత్య, శ్రీలత, రాజకుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రైతులను దగా చేస్తున్న బీజేపీ ప్రభుత్వం



- సొనాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల పోతన్న
- పత్తి రైతుల సమస్యలపై మండిపాటు

**శెనార్తి మీడియా, బోథ్ :**

పత్తి రైతులను బీజేపీ ప్రభుత్వం దగా చేస్తోందని సొనల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల పోతన్న తీవ్రంగా మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి కారణంగా ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సాయం అందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన పత్తి గిట్టుబాటు ధర 8110 రూపాయలుగా ఉన్నా, రైతులు ఆ ధరకు పంటను అమ్ముకోలేకపోతున్నారని తెలిపారు. తేమ శాతం పేరుతో షరతులు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. గతంలో ఎకరాకు 11 క్వింటాళ్లు పత్తి కొనుగోలు చేసినప్పుడు ఇప్పుడు కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని నిబంధనలు విధించడం బీజేపీ రైతు వ్యతిరేక ధోరణిని చూపిస్తోందన్నారు. అదే విధంగా పత్తి దిగుబడిపై సుంకాలు ఎత్తివేయడంతో అంతర్జాతీయ మార్కెట్ వర్గాలకే లాభం చేకూరుతోందని విమర్శించారు. రైతుల పక్షాన నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం, మిల్లర్లు, దళారుల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తోందని గాజుల పోతన్న ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను కేంద్రానికి విన్నవించినా స్పందన లేకపోవడం విచారకరమని తెలిపారు. కాపాస్ యాప్ పేరుతో తెచ్చిన విధానం రైతులకు కాకుండా మిల్లర్లకే ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఇకనైనా బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకుని, సరళమైన కొనుగోలు విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోతే, రైతులు తిరగబడి బీజేపీకి సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కేంద్రం వైఖరితో రైతు పంట అమ్మే స్థితిలో లేరు

- బోథ్ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి

**శెనార్తి మీడియా, బోథ్ :**



కేంద్రం వైఖరితో రైతులు తమ పంటలను అమ్మే స్థితిలో లేరని బోథ్ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో మాట్లాడిన గంగారెడ్డి మాట్లాడుతూ, "రైతులకు సరైన అవగాహన లేకుండా కాపాస్ యాప్‌ను తీసుకొచ్చి వారిని గందరగోళంలోకి నెట్టింది కేంద్రం. అంతకుముందు యూరియా, ఎరువులు అందుబాటులో లేకపోవడంతో పాటు అధిక ధరలు విధించి రైతులపై భారాన్ని మోపింది. ఇప్పుడు తెల్లబంగారం పంటను కొనుగోలు చేయడంలోనూ కేంద్రం విఫలమైంది" అని విమర్శించారు. రైతుల పత్తి పంటను కేవలం ఏడుక్వింటాళ్లవరకే కొనుగోలు చేస్తామని షరతు విధించడం రైతులను ద?? చేస్తున్నదన్నారు. "మిగతా పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలి? రైతుల సమస్యలపై మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పత్తి సాగును తగ్గించి, విదేశాల నుండి దిగుమతులు పెంచేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదన్న ఆరోపణను గంగారెడ్డి చేశారు. "ఇలా కొనసాగితే రైతుల జీవితం, ఆర్థిక భరోసా పూర్తిగా దెబ్బతింటుంది" అని హెచ్చరించారు.

# జగదాంబ సేవాలాల్ మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- న్యాయవాది పంద్రం శంకర్

**శెనార్తి మీడియా, బోథ్ :**

హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. హరీష్‌ను న్యాయవాది పంద్రం శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ మండల కేంద్రంలో నిర్మించనున్న జగదాంబ సేవాలాల్ మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నేరేడిపల్లి ఆలయం, మార్కండేయ మందిరం, పార్డి బి, పరుపులపల్లి గ్రామాల మందిరాలకు టెండర్లు వేయాలని కమిషనర్‌కు దరఖాస్తు సమర్పించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని పంద్రం శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో జూగ్నక్ కైలాష్, తోడషం మధు, తోడషం నగేష్ ఉన్నారు.





## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి: డీసీపీ భాస్కర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి భాస్కర్ తెలిపారు. లక్షెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన భాస్కర్, పోలీసులు ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్నారని చెప్పారు. వాహనదారులు నిర్లక్ష్యంగా నడపడం వల్లే అనేక ప్రాణాలు బలవుతున్నాయని, దాంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా కష్టాలు పడుతున్నాయని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరూ వాటిని కచ్చితంగా పాటించాలని సూచించారు. బైక్ నడిపే వారు హెల్మెట్ ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. స్కూల్ విద్యార్థులను డ్రైవర్లు జాగ్రత్తగా తీసుకెళ్లాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రాష్ డ్రైవింగ్ నేరమని హెచ్చరించారు. వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామంటూ వాహనదారులతో ప్రమాణం చేయించి, అనంతరం కొందరికి హెల్మెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీఐ రమణమూర్తి, ఎస్ఐలు గోపతి సురేష్, తహసినోద్దీన్, అనూష, రవాణా శాఖ అధికారులు, పోలీసులు, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోట కుమార్‌కు జాతీయ అవార్డు

- అక్షర స్కూల్స్ చైర్మన్, కేకే క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అధినేతకు భారతీయ స్ఫూర్తి సేవారత్న పురస్కారం



**శెనార్తి మీడియా, రామగుండం:** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అక్షర స్కూల్స్ చైర్మన్, కేకే క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అధినేత కోట కుమార్ భారతీయ స్ఫూర్తి సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. విద్యావేత్తగా ప్రారంభమైన కోట కుమార్, పేద విద్యార్థులకు ఉచిత విద్యాబోధన, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ సేవలో అంకిత భావంతో పనిచేశారు. వ్యాపార రంగంలో కూడా సుస్థిర స్థానాన్ని సంపాదించి, సేవా కార్యక్రమాల్లో విశేష పాత్ర పోషించారు. ప్రజాసేవకు అంకితమైన వ్యక్తులను గుర్తించి స్ఫూర్తినింపడం లక్ష్యంగా ఈ అవార్డును అందజేస్తున్నట్లు డాక్టర్ లయన్ ఆకుల రమేష్ తెలిపారు. గత దశాబ్ద కాలంగా పేద పిల్లల చదువుకు తోడ్పడుతూ, ఆపదలో ఉన్న వారికి సహాయం చేసిన కోట కుమార్‌ను సామాజిక సేవకులు డాక్టర్ దేవీ లక్ష్మి నరసయ్య అభినందించారు.

## పట్నాపూర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**శెనార్తి మీడియా, బోథ్:** బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామానికి అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అవసరమని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. అదేవిధంగా ఫులాజీ బాబా భక్తులు కూడా ఎంపీ నగేష్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోడం జుగాదిరావు, నాయకులు విజయ్ పొలన పటేల్, గోపాల్, ఆచంత్ రావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు పరామర్శ



**శెనార్తి మీడియా, బోథ్ :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో బోథ్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బండారి ముత్యం రెడ్డి మంగళవారం ఆయనను స్వగృహంలో కలుసుకొని పరామర్శించారు. హరీష్ రావుతో ఉద్యమం కాలం నుంచే సన్నిహిత సంబంధాలు ఉన్న ముత్యం రెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బోథ్ వాసులు కూడా పాల్గొన్నారు.

## డాక్టర్ బాలాజీకి ఘన సన్మానం



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సుదీర్ఘకాలం ఎంబీబీఎస్, ఎంఎస్ సర్జన్‌గా సేవలందించిన డాక్టర్ బాలాజీ తాజాగా ప్రభుత్వం ఆర్ఎంఓగా పదోన్నతి కల్పించడంతో బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయనకు మంగళవారం మంచిర్యాల పట్టణంలోని గౌతమి హాస్పిటల్‌లో ఘనంగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డాక్టర్ బాలాజీ సమాజానికి మరిన్ని సేవలు అందించాలని, భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొంది మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. బీసీ వర్గానికి చెందిన వారు అన్ని రంగాలలో రాణించాలని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, బీసీ నాయకులు పంపరి వేణుగోపాల్, మంచర్ల సదానందం, ఏదునూరి రమేష్, సూరన్న, కీర్తి బిక్షపతి, చలిమెల అంజయ్య, చంద్రగిరి చంద్రమౌళి, రాసమల్ల రాజేశ్వరి, ఇన్నారం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## దొనబండ హాస్టల్ వార్డెన్ పై ఫిర్యాదు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా దొనబండ హాస్టల్ వార్డెన్‌ను శాశ్వతంగా విధుల నుండి తొలగించి, జిల్లా నుండి సరెండర్ చేయాలని పీడీఎస్యూలో విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా సామాజిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి (ఎస్‌సీడీడీఓ) దుర్గ ప్రసాద్‌కు ఫిర్యాదు సమర్పించారు. వార్డెన్ ప్రవర్తనపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్యూలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు పి.సికిందర్, కే.కార్తీక్, అంజి, అంజి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో పెళ్లి బంధంలోకి స్మృతి అడుగు

ప్రపంచ ఛాంపియన్ స్మృతి మంధాన త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. స్మృతి తన ప్రియుడు పలాష్ ముచ్చల్ తో పెళ్లి చేసుకోనున్నారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ దాదాపు 6 సంవత్సరాలుగా ఒకరితో ఒకరు ఉన్నారు. భారతదేశం ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా పలాష్, స్మృతితో కనిపించారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వరల్డ్ కప్ ట్రోఫీతో ఫోటో దిగారు. ఈ జంట భారతదేశం సాధించిన విజయాన్ని కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు.పలాష్ తన చేతిపై స్మృతి మంధానా పేరుతో టాటూ కూడా వేయించుకున్నారు. పలాష్ తన సోషల్ మీడియాలో దీని ఫోటోను కూడా షేర్ చేశాడు.పలాష్ ముచ్చల్ సరే త దర్శకుడు. పలాష్ సోదరి, గాయని పలక్ ముచ్చల్‌తో కూడా స్మృతి మంధానకు మంచి సంబంధం ఉంది. పలక్ ముచ్చల్ స్మృతి పుట్టినరోజున కలిసిన ఫోటో కూడా షేర్ చేసింది. పలాష్ 'తూ హి హై ఆషికీ', 'పార్టీ తో బనతీ హై' వంటి హిట్ పాటలపై వర్క్ చేశారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ లవ్ స్టోరీ 2019లో ప్రారంభమైంది. పలాష్ తన సోదరి పలక్ ముచ్చల్ ముందు స్మృతికి ప్రపోజ్ చేశాడు, ఆమె కోసం చాలా అందమైన పాట కూడా పాడాడు.పలాష్ ముచ్చల్ స్మృతి మంధానతో తన సంబంధం గురించి జూలై 2024లో వెల్లడించాడు, అప్పుడు వారి సంబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. పలాష్ ఇటీవల మాట్లాడుతూ స్మృతి మంధానా త్వరలో ఇండోర్ కోడలు కాబోతోందని కూడా చెప్పాడు. ఆనంద బజార్ పత్రిక ప్రకారం, ఈ జంట వివాహం నవంబర్ 20, 2025 న జరగవచ్చు. వీరి వివాహం స్మృతి స్వస్థలమైన సార్లేలో జరగవచ్చు.




# క్రికెట్ జెంటిల్మెన్ గేమ్ కాదు

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ICC మహిళల వన్డే ప్రపంచ కప్ నెగ్గిన తర్వాత చాలా సంతోషంగా ఉంది. వరల్డ్ కప్ సాధించిన తరువాత తన మొదటి సోషల్ మీడియా పోస్ట్ షేర్ చేసింది. అయితే ఈ పోస్ట్ సంచలనం సృష్టించింది. భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రపంచ కప్ విజేత కెప్టెన్‌గా నిలిచిన హర్మన్ ప్రీత్ ఈ పోస్ట్ కేవలం వేడుకలతో లేదు, ఇది అందరి దృష్టిని ఆకర్షించిన ఒక రహస్య సందేశంలా మారింది. హర్మన్‌ప్రీత్ ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రోఫీతో తన ఫోటోను షేర్ చేసింది. ఆమె ధరించిన టీషర్టుపై "క్రికెట్ కేవలం జెంటిల్‌మెన్ గేమ్ మాత్రమే కాదు" అని రాసి ఉంది. సాధారణంగా క్రికెట్ అంటే జెంటిల్మెన్ గేమ్ అని వ్యవహరిస్తారు. అయితే హర్మన్ టీషర్టుపై క్రికెట్ అందరి గేమ్ అని స్పష్టం చేసింది. అందుకోసం జెంటిల్మెన్ గేమ్ అనే పదాలను కొట్టివేస్తున్నట్లుగా ఆమె జెర్సీపై రాసి ఉంది. క్రికెట్ ఇప్పుడు కేవలం "పురుషుల ఆట" మాత్రమే కాదు, మహిళలది కూడా అని సందేశాన్ని ఇచ్చింది. మహిళా క్రికెటర్లు ఇప్పుడు క్రికెట్‌లో సమాన గౌరవం, గుర్తింపునకు అర్హులని హర్మన్ సందేశం స్పష్టంగా ఉంది. హర్మన్‌ప్రీత్ పోస్ట్ మహిళా క్రికెట్ మారుతున్న తీరును వివరిస్తుంది. చాలా సంవత్సరాలుగా క్రికెట్‌ను పురుషుల ఆట (జెంటిల్మెన్ గేమ్)గా చూశారు. కాని ఇప్పుడు భారత మహిళా జట్టు ఈ ఆట ఇకపై 'పురుషుల'ది మాత్రమే కాదు, 'మహిళల'ది కూడా అని నిరూపించేలా వన్డే వరల్డ్ కప్ గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. హర్మన్ చేసిన ఈ పోస్ట్‌ను లక్షలాది మంది లైక్ చేశారు. వేలాది మంది వ్యాఖ్యానించి ఆమె ఆత్మవిశ్వాసాన్ని, ఆలోచనను ప్రశంసించారు.ప్రపంచ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా మీద భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో ఆదివారం జరిగిన డే అండ్ నైట్ జరిగిన మ్యాచ్‌లో టీమిండియా దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి మహిళల వన్డే ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ 87 పరుగులు, స్మృతి మంధాన 45 పరుగులతో రాణించారు. మిడిలార్డర్ లో దీప్తి శర్మ విలువైన 58 పరుగులు, రిచా ఘోష్ 24 బంతుల్లో 34 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించారు. టార్గెట్ ఛేదనలో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ సెంచరీ సాధించింది. ఆ జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ తొలిసారి వన్డే వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. ఐదు దశాబ్దాల వరల్డ్ కప్ కల నెరవేరడంతో మహిళల క్రికెట్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది.

# జైస్వాల్ మెరుపు సెంచరీ



భారత యువ క్రికెట్ సంచలనం యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీ సాధించాడు. ప్రస్తుతం రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై తరఫున ఆడుతున్న జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు సెంచరీతో జట్టును కష్టాల నుంచి గట్టెక్కించాడు. ఈ సెంచరీతో అతను తన అద్భుతమైన టచ్‌ను ప్రదర్శించడమే కాక, గత 45 ఏళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ సగటు కలిగిన ఓపెనర్లలో నెంబర్ 1 స్థానంలో ఎందుకు ఉన్నాడో మరోసారి నిరూపించాడు. రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై జట్టు తరఫున ఆడుతున్న యశస్వి జైస్వాల్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన చేశాడు. జైస్వాల్ కేవలం 120 బంతుల్లోనే 11 బౌండరీల సహాయంతో ఈ సెంచరీని పూర్తి చేశాడు. ఈ సెంచరీతో రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో తీసుకున్న భారీ ఆధిక్యం (300ం రన్స్) ఒత్తిడి నుంచి ముంబై జట్టును గట్టెక్కించాడు.


# పెరిగిన మహిళా క్రికెటర్ల బ్రాండ్ విలువ

**కప్ ఫైనల్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించి తొలిసారిగా విశ్వవిజేతగా నిలిచింది. పురుష క్రికెటర్ల మాదిరిగానే తమ ప్రభావాన్ని చూపి వన్డే ప్రపంచకప్‌ను తమ సొంతం చేసుకుంది భారత మహిళా జట్టు. తమ సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ విజయంతో మహిళా క్రికెటర్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుసింది. వరల్డ్‌కప్ విజయంతో టీమ్‌ఇండియా మహిళా క్రికెటర్లకు గౌరవం, గుర్తింపు మాత్రమే కాకుండా, వాణిజ్య విలువ కూడా ఆకాశాన్నంటింది.**





ఇప్పుడు వీరిని బ్రాండ్ ప్రపంచం కొత్త స్టార్‌లుగా చూస్తోంది. మొత్తంగా చూస్తే ఈ ప్రపంచ కప్ విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. మహిళా వరల్డ్‌కప్ ఫైనల్ ముగిసిన 24 గంటల వ్యవధిలోనే హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ వంటి ఆటగాళ్ల బ్రాండ్ విలువలు 25 నుంచి 100 శాతం వరకూ పెరిగినట్లు సమాచారం. అదే సమయంలో వీరి సోషల్ మీడియా ఫాలోవర్లు కూడా విపరీతంగా పెరిగారు.సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనతో 127 పరుగులు (134 బంతుల్లో, 14 ఫోర్లతో) చేసి నాటౌట్‌గా నిలిచిన జెమీమా రోడ్రిగ్స్ ప్రస్తుతం అత్యంత డిమాండ్‌లో ఉన్న మహిళా స్టార్ క్రికెటర్‌గా ముందంజలో ఉంది. సెమీ ఫైనల్ ముగిసిన తర్వాత ఆమెకు బ్రాండ్‌ల నుంచి విపరీతమైన ఆసక్తి కనిపించింది. ఆమె బ్రాండ్ విలువ 100 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఆమె ఒక్కో బ్రాండ్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేస్తోందట. జెమీమా ఇప్పటికే రెడ్‌బుల్, బోట్, సర్ఫ్‌ఎక్సెల్ వంటి ప్రముఖ బ్రాండ్‌లకు అంబాసడర్‌గా వ్యవహరిస్తోంది. దేశంలో అత్యధిక పారితోషికం పొందుతున్న మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె రక్సోనా, నైక్, హ్యుందాయ్, హెర్బాలైఫ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గల్ఫ్ ఆయిల్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ వంటి 16 ప్రముఖ బ్రాండ్‌లకు అంబాసడర్‌గా ఉంది. ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ద్వారా రూ.1.5 నుంచి రూ.2 కోట్ల వరకు సంపాదిస్తున్నట్లు తెలిసింది.మొదటి సారిగా ఐసీసీ ప్రపంచ కప్‌ను గెలుచుకున్న తర్వాత మైదానంలో భావోద్వేగపూరితమైన దృశ్యం ఆవిష్కృతమైంది. గెలుపు అనంతరం భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కోచ్ అమోల్ మజుందార్ పాదాలను తాకి నమ-స్కరించింది. దీంతో భారత గురు- శిష్య సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ చర్య నిలిచింది. మజుందార్ వెంటనే ఆమెను ఆప్యాయంగా పైకిలేపారు. కాగా ఈ విజయం కోచ్, కెప్టెన్ ఇద్దరి కళ్లలో ఆనంద బాష్పాలను నిపింది.




# బిగ్ బాష్ లీగ్ నుంచి తప్పుకున్న అశ్విన్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్‌లో ఆడటానికి సిద్ధమైన భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. బీబీఎల్ తదుపరి సీజన్‌లో సిడ్నీ థండర్ తరఫున ఆడడం దాదాపు ఖాయమైనప్పటికీ, గాయం కారణంగా ఆయన ఈ లీగ్ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. అశ్విన్ గనుక ఆడి ఉంటే, బీబీఎల్లో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా చరిత్ర సృష్టించి ఉండేవారు. అశ్విన్‌కు అయిన గాయం ఏమిటి ఎప్పుడు తిరిగి వచ్చే అవకాశం ఉంది వంటి వివరాలు ఈ వార్తలో చూద్దాం. భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్ మైదానంలోకి తిరిగి రావడానికి మరింత వేచి చూడాల్సి వస్తుంది. మోకాలి గాయం కారణంగా ఆయన ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ నుంచి తప్పుకున్నారు. అశ్విన్ బీబీఎల్ లో సిడ్నీ థండర్ జట్టు తరఫున పూర్తి సీజన్ ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకవేళ అశ్విన్ ఆడి ఉంటే బీబీఎల్ చరిత్రలో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా నిలిచి ఉండేవారు. కానీ గాయం కారణంగా ఈ చారిత్రక అవకాశం ప్రస్తుతానికి మిస్ అయింది. అశ్విన్ త్వరగా కోలుకుంటే, సీజన్ మధ్యలో సిడ్నీ థండర్ జట్టు అతన్ని తిరిగి ఆడటానికి ఆహ్వానించే అవకాశం ఉంది. అశ్విన్ స్వయంగా సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేసి, తన గాయం, బీబీఎల్ నుంచి వైదొలగడం వెనుక కారణాలను తెలియజేశారు. "బీబీఎల్ తదుపరి సీజన్‌కు చెన్నైలో సిద్ధమవుతున్న సమయంలో నాకు మోకాలిలో గాయం అయింది. పరీక్షల తర్వాత, నేను బీబీఎల్ 15లో ఆడలేనని తెలిసింది" అని అశ్విన్ తన ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియన్ అభిమానుల ముందు ఆడటానికి తాను ఎంతగానో ఉత్సాహంగా ఉన్నానని, కానీ ఈ నిర్ణయం తీసుకోవడం తనకు బాధ కలిగించిందని ఆయన వ్యక్తం చేశారు. సిడ్నీ థండర్ ఆటగాళ్లు, సిబ్బంది తనకు పూర్తి మద్దతు ఇచ్చారని అశ్విన్ తెలిపారు. మైదానంలో లేకపోయినా, తాను థండర్ మహిళా, పురుషుల జట్లను ఉత్సాహపరుస్తూ ఉంటానని చెప్పారు. రవిచంద్రన్ అశ్విన్ అదే సంవత్సరంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత బీబీఎల్ లో ఆడాలని నిర్ణయించుకున్నారు. అశ్విన్ ఈ సంవత్సరం ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఆ తరువాత అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటానికి మొగ్గు చూపాడు. బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ డిసెంబర్ 14 నుంచి జనవరి 25 వరకు జరగనుంది. సిడ్నీ థండర్ జట్టు తమ మొదటి మ్యాచ్‌ను డిసెంబర్ 16న హోబర్ట్ హరికేన్స్‌తో ఆడాల్సి ఉంది. ఈ మధ్యలో అశ్విన్‌కు ఐఎల్టీ20 లీగ్‌లో ఏ జట్టు కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం.

# నంబర్ 1 స్థానాన్ని కోల్పోయిన స్మృతి మంధాన




భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ 2025 విజయంలో కీలక పాత్ర పోషించిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు ఊహించని షాక్ తగిలింది. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత క్రీడాకారిణిగా నిలిచినప్పటికీ ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆమె నంబర్ 1 స్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు సాధించడంతో మంధానను వెనక్కి నెట్టి నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. భారత క్రికెట్‌కు గర్వకారణంగా నిలిచిన స్మృతి మంధాన.. ర్యాంకింగ్స్‌లో ఎలా వెనుకబడింది..భారత మహిళా జట్టు ప్రపంచకప్ 2025లో విజయం సాధించిన తర్వాత, అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా వన్డే ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానంలో మార్పు చోటు చేసుకుంది. చాలా కాలంగా నంబర్ 1 స్థానంలో ఉన్న భారత ఓపెనర్ స్మృతి మంధాన, ఇప్పుడు 811 రేటింగ్ పాయింట్లు సాధించి రెండో స్థానానికి పడిపోయింది. ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, 814 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. ప్రపంచకప్‌లో స్మృతి మంధాన అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించింది. ఆమె భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. స్మృతి మంధాన టోర్నమెంట్‌లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 54.25 సగటుతో మొత్తం 434 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆమె 45 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. ఇంత మంచి ప్రదర్శన చేసినప్పటికీ, సౌతాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్డ్ స్మృతి మంధాన కంటే ఎక్కువ రేటింగ్ పాయింట్లు సాధించడం వలన, స్మృతి మంధాన తన నంబర్ 1 కిరీటాన్ని కోల్పోవాల్సి వచ్చింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ ప్రపంచకప్‌లో బ్యాట్‌తో సంచలనం సృష్టించింది. ఆమె జట్టు ఫైనల్ ఓడినప్పటికీ, ఆమె వ్యక్తిగత ప్రదర్శన అసాధారణంగా ఉంది. లారా వోల్వార్డ్ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. భారత్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆమె సెంచరీ సాధించి, ఒంటరి పోరాటం చేసింది. అయితే, మిగిలిన దక్షిణాఫ్రికా బ్యాటర్లు హాఫ్ సెంచరీలు కూడా చేయలేకపోయారు. ఆమె అద్భుతమైన స్థిరత్వం కారణంగానే వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానం దక్కింది.

# మహిళల జట్టుకు నెలరోజుల సుదీర్ఘ విరామం

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ.. తొలి ప్రపంచకప్‌ను ముద్దాడింది. 2005, 2017లో తృటిలో చేజారిన కప్‌ను ఈ సారి ఏ తప్పిదం చేయకుండా ఒడిసి పట్టుకుంది. ఫైనల్ ఒత్తిడిని చిరునవ్వుతూ ఛేదిస్తూ తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికాను మట్టికరిపించింది. 1983 ప్రపంచకప్ విజయం భారత్‌లో క్రికెట్ క్రేజ్‌ను పెంచితే.. అమ్మాయిల తాజా విజయం మగువల క్రికెట్‌కు ఆదరణ పెంచనుంది.ఇప్పటికే భారత మహిళల క్రికెట్ బ్రాండ్ వాల్యూ 25 నుంచి 100 శాతానికి పెరిగింది. నెటిజన్లు కూడా టీమిండియా మహిళల తదుపరి షెడ్యూల్ గురించి ఆరా తీస్తున్నారు. మరో 7 నెలల్లో మహిళల టీ20 ప్రపంచకప్ జరగనుంది. ఇంగ్లండ్ వేదికగా జరగనున్న ఈ టోర్నీ కోసం టీమిండియా సన్నదం కానుంది.ప్రపంచకప్ విజయంతో భారత మహిళల జట్టుకు నెలరోజుల సుదీర్ఘ విరామం లభించనుంది. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరిగే మూడు వన్డే, మూడు టీ20ల సిరీస్‌తో హర్మన్‌సేన మైదానంలోకి రీఎంట్రీ ఇవ్వనుంది. డిసెంబర్‌లో ఈ సిరీస్‌లు జరగనున్నాయి. ఆ తర్వాత జనవరి-ఫిబ్రవరి 2026 మధ్య వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్ జరగనుంది. ఈ సీజన్‌కు సంబంధించిన వేలం ఈ నెలాఖరులో జరిగే ఛాన్స్ ఉంది. ఆ తర్వాత మూడు టీ20లు, మూడు వన్డేలు, ఏకైక టెస్ట్ మ్యాచ్ కోసం భారత మహిళల జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటన ఫిబ్రవరి 15 నుంచి మార్చి 9వరకు సాగనుంది. మేలో భారత్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య ట్రై సిరీస్ జరగనుంది.



## 'మస్తీ 4'లో హీట్ పెంచేసిన రూహి సింగ్

సన్‌షైన్ యెల్లో డ్రెస్‌లో కట్టిపడేసిన గ్లామర్'మస్తీ 4' ప్రమోషన్ ఫోటోషూట్‌లో రూహి సింగ్ తన అద్భుత గ్లామర్‌తో హీట్ పెంచేసింది. సన్‌షైన్ యెల్లో రంగులోని బ్యాండేజ్ డ్రెస్సులో ఆమె అందం మరింత మెరుపులు జల్లింది. ప్రతి వంపునూ స్పష్టంగా హైలైట్ చేసే ఆ డ్రెస్‌లో రూహి ఆకట్టుకునే హావభావాలతో మెరిసింది.ఈ ఫోటోషూట్‌ను కాపిల్ పర్మార్ చిత్రీకరించగా, గ్లామ్ మేకప్ బ్యూటీ బేకవీ, హెయిర్ స్టైలింగ్ సన్నీ హెయిర్, కాస్ట్యూమ్ స్టైలింగ్ మెహర్ బవా నిర్వహించారు. ప్రత్యేకమైన డ్రెస్ డిజైన్‌కు రాకీ స్టార్ కృతజ్ఞతలు తెలిపారు.'మస్తీ 4' చిత్రం నవంబర్ 21న విడుదల కానుంది.

# పెద్దిలో మోహిత్ చౌహాన్ పాట



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న పెద్ది సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట చికిరి అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్ అని ట్వీట్ చేశారు. దానికి చికిరి చికిరి.. చరణ్‌గారు అంటూ సంతిత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. రాక్ స్టార్ సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంతిత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉ ంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాలో ఇదేరా అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు పెద్ది సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.



## థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా విరూపాక్ష దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో లాపతా లేడీస్ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంతిత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంతితం అందిస్తున్నాడు.



# దుల్కర్ సల్మాన్..కాంత మూవీ



మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉ ండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ది హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్దమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# రింగు నాకు చాలా ఇంపార్టెంట్



నేషనల్ క్రష్ రష్మిక మందన్నత్వరలో 'ది గర్ల్‌ఫ్రెండ్' మూవీతో రాబోతుంది. దీంతో ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీ అయిపోయిన ఆమె.. తాజాగా, జగపతి బాబు హోస్ట్ చేస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' షోలో పాల్గొంది. ఈ షోలో భాగంగా విజయ్ దేవరకొండతో ఎంగేజ్‌మెంట్ జరగడంపై స్పందించి క్లారిటీ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రోమో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో జగపతి బాబు.. రష్మికకు గాలి పిల్ల అనే నిక్‌నేమ్ పెట్టానని అంటాడు. దానికి రష్మిక నవ్వుతూ.. అయ్యయ్యో సార్ అంటుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ ఫ్రెండ్, విజయ్‌కి ఆల్‌టైమ్ ఫ్యాన్. మరి విజయం విజయ్ అంతా నీకే సొంతమా అనగా.. ఏమో అని అంటుంది. ఇక ఆమె పెట్టుకున్న రింగులు చాలా ఇంపార్టెంట్‌హా అని అడగ్గా.. అవును ఇవన్నీ నాకు చాలా ఇంపార్టెంట్ అని చెప్పడంతో అంతా గోల గోల చేస్తారు. వాటిలో ఇకటి చాలా ఫేవరెట్ రింగ్, దానికి ఓ హిస్టరీ ఉందట కదా? అని అంటాడు. ఇక రష్మిక సిగ్గు పడుతూ కనిపిస్తుంది. నాకు వాళ్ల రియాక్షన్ చాలా ఇష్టం. నేను దానిని ఎంజాయ్ చేస్తున్నా" అని చెప్పింది. ఇక చివర్లో ఎంగేజ్‌మెంట్ రింగ్ షాట్ ప్రోమోలో హైలెట్‌గా మారింది. ఈ షో ప్రోమో చూసిన వారంతా విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ నిజమేనని కంగ్రాట్స్ చెబుతున్నారు.

## పిఠాపురంలో..అలా మొదలయ్యింది



తొలి చిత్రం ప్రేయసి రావేతోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం పిఠాపురంలో. అలా మొదలైంది అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో పిఠాపురం అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం అని తెలిపారు.

Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**